దొరికిన డబ్బు పోలీసులకు..!

నిజాయితీ చాటుకున్న మెడికల్ రెప్



సీఐ సమక్షంలో డబ్బు అందజేస్తున్న మురళీధర్

అనంతపురం క్రైం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఓ మెడికల్ రెప్ దొరికిన డబ్బు పోలీసులకు అందజేసి నిజాయితీ చాటుకున్నారు. గురువారం నగరానికి చెంది న మెడికల్ రెప్ మురళీధర్ శ్రీకంఠం సమీపం లోని ఐసీఐసీఐ బ్యాంకు ఏటీఎం వద్దకు వెళ్తుండగా... అక్కడ ఓ బ్యాగ్ దొరికింది. అందులో రూ.2 లక్షలు ఉండటం చూసి నేరుగా వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్‌కు అందజేశారు. అదే సమయంలో తలుపులకు చెందిన మేఘనాథ్‌రెడ్డి రూ.5లక్షల నగదు ఓ బ్యాగులో, రూ.2 లక్షలు మరో దాంట్లో తీసుకుని డిపాజిట్ చేయడానికి వెళ్తుండగా... ఒకటి పడిపోయింది. తరువాత వచ్చి చూసేసరికి కనిపించలేదు. దీంతో టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కానిస్టేబుల్ లింగ వివరాలు తీసుకున్నాడు. డబ్బు మేఘనాథ్ రెడ్డిదేనని నిర్ధారించాక వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ సమక్షంలో రూ.2లక్షల డబ్బు అందజేశారు. మురళీధర్ నిజాయితీని అందరూ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో సతామి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

అనంతపురం కల్చరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో వచ్చే సతామి (లైలతుల్ ఖదర్)ను పురస్కరించుకుని గురువారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇళ్లనుంచి తీసుకువచ్చిన ఫలహారాలను ఒకరికొకరు పంచుకుని ఇఫ్తార్ విందును స్వీకరించారు. అర్ధరాత్రి దాటేవరకూ ప్రత్యేక ప్రార్థనలు, ఖురాన్ పఠనాలు చేస్తూ గడిపారు. పలు మసీదుల్లో మతపెద్దలు ఖురాన్ ప్రసంగాలు చేశారు. జిల్లా కేంద్రంలోని నూరాని మస్జిద్, ఈద్గా, నడిమివంక వద్దగల చాందినీ మస్జిద్, జామియా, పాతూరులోని జంగాలపల్లి మస్జిద్‌లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అరవిందనగర్ మస్జిద్‌లో సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు అందజేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.33 (శుక్రవారం సాయంత్రం)

సెహరీ : 5.02 (శనివారం ఉదయం)

ఉత్కంఠ.. ఉద్రిక్తత..!

రెండు చోట్ల నేటికి వాయిదా



పోలీసులు అడ్డుకుంటున్నా.. రెచ్చిపోతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి



పెనుకొండ తహసీల్దారు కార్యాలయం వద్ద భారీగా పోలీసులు

3 ఎంపీపీ, 4 వైస్ ఎంపీపీల ఎన్నిక

కంబదూరులో ప్రిసైడింగ్ ఆఫీసర్‌కు అస్వస్థత

గాండ్లపెంటలో గందరగోళం.. రామగిరిలో ఉద్రిక్తత

అనంతపురం విద్య, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఐదు ఎంపీపీ, నాలుగు వైస్ ఎంపీపీ స్థానాలకు గానూ రెండు చోట్ల శుక్రవారానికి వాయిదా పడ్డాయి. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి ఎంపీపీ పదవి ఎన్నికలు కోరం లేక వాయిదా పడ్డాయి. అనంతపురం జిల్లా గాండ్లపెంట ఎంపీపీ పదవి ఎన్నికల్లో ఒకే ఎంపీటీసీ ఇద్దరు ఎంపీపీ అభ్యర్థులను ప్రపోజ్ చేయడంతో గందరగోళం ఏడింది. దీంతో ఎన్నికను వాయిదా వేశారు. ఈ రెండు స్థానాలకు శుక్రవారం ఎన్నికలు నిర్వహిస్తారు. కంబదూరు ఎంపీపీ ఎన్నిక సమయంలో ప్రిసైడింగ్ ఆఫీసర్ మద్దిలేటి ఆందోళనకు లోనయ్యారు. బీపీ పెరిగి ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చింది. అప్పటికే అక్కడికి చేరుకున్న జేసీ శివనారాయణ శర్మ.. ఎన్నిక ప్రక్రియను కొనసాగించాలని ఎంపీడీఓ, తహసీల్దార్‌ను ఆదేశించారు. దీంతో ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. మొత్తంగా మూడు ఎంపీపీ, నాలుగు వైస్ ఎంపీపీ స్థానాల ఎన్నికలు పూర్తి అయ్యాయి.

ఎన్నికైంది వీరే..

కణేకల్లు ఎంపీపీగా చంద్రయ్య, కంబదూరు ఎంపీపీగా లక్ష్మీదేవి, రొద్దం ఎంపీపీగా నాగమ్మను సభ్యులు ఎన్నుకున్నారు. ఉరవకొండ వైస్ ఎంపీపీగా ఉరవకొండ-10 ఎంపీటీసీ ఈడిగ ప్రసాద్ గౌడ్, పెద్దపప్పూరు వైస్ ఎంపీపీగా నాగవేణి, రాయదుర్గం వైస్ ఎంపీపీగా వడ్రహొన్నూరు ఎంపీటీసీ అరుణ్‌కుమార్, యల్లనూరు వైస్ ఎంపీపీగా తిమ్మంపల్లి ఎంపీటీసీ రమాదేవి ఎన్నికయ్యారు. వీరందరూ వైసీపీ వర్గీయులే. జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. రెండు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, తొమ్మిది మండలాల ఎన్నికల అధికారులను

(తరువాయి 5లో..)

దొంగ చేతికి తాళాలు..!

- అవినీతి అధికారిని చర్యల నుంచి తప్పించే ప్రయత్నం
- మెమో జారీతో సరి..
- విచారణలో పాల్గొన్న వార్డెన్ల వివరాలు బహిర్గతం
- ఆధారాలు సేకరించి పంపాలని అవినీతి అధికారికి బాధ్యతలు
- రూ.లక్షలు చేతులు మారినట్లు ప్రచారం
- రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల నిర్వాకమిదీ..
- మంత్రిని తప్పుదోవ పట్టించిన వైనం



శ్రీసత్యసాయి జిల్లా బీసీ సంక్షేమశాఖ కార్యాలయం

అనంతపురం, మార్చి27(ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణల నేపథ్యంలో విచారణ ఎదుర్కొన్న అధికారికే ఆధారాలు సేకరించాలని ఆ శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఆదేశాలివ్వడం.. దొంగ చేతికి తాళాలిచ్చిన చందంగా ఉందనడంలో అతిశయోక్తి లేదు. శ్రీసత్యసాయి జిల్లాలోని బీసీ సంక్షేమశాఖ అధికారిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో... 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలను ప్రచురించింది. వాటి ఆధారంగా ఆ అవినీతి అధికారిపై ఆ శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. విచారణాధికారిగా ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి నెలన్నర క్రితం శ్రీసత్యసాయి జిల్లాకు రావడం... ఆ అవినీతి అధికారిపై క్షేత్రస్థాయిలో వార్డెన్లతో విచారణ చేపట్టడం వరుసగా జరిగిపోయాయి. ఆ వార్డెన్ల ద్వారా సేకరించిన ఆధారాలతో నివేదిక తయారు చేసి, ఆ శాఖ డైరెక్టర్‌కు అందజేస్తామని విచారణాధికారి స్పష్టంగా వెల్లడించారు. నెలన్నర క్రితం విచారణ పూర్తయితే... నివేదిక అందజేయడానికి అంతే సమయం పట్టడం అనేక అనుమానాలకు...

(తరువాయి 5వ పేజీలో..)

ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ

అనంతపురం టౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్మును ఏప్రిల్ 1వ తేదీన ఉదయం 7గంటల నుంచి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేయనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ నెలకు సంబంధించి జిల్లాలో 2,79,165 మంది లబ్ధిదారులకు రూ.123.76 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మొదటిరోజు సాంకేతిక, ఇతర కారణాలతో పింఛన్ అందుకోని లబ్ధిదారులకు రెండోరోజు ఇళ్ల వద్దనే అందజేస్తారని ఆయన వివరించారు.

ప్రశాంతంగా ఉప సర్పంచ్ ఎన్నికలు



రామగిరి ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తున్న అధికారులు

అనంతపురం న్యూటౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ స్థానాలకు గురువారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు తెలిపారు. పామిడి మండలంలోని రామగిరి పంచాయతీ ఉపసర్పంచ్‌గా లక్ష్మీదేవి, వజ్రకరూరు మండలం కొనకొండ్ల ఉపసర్పంచ్‌గా చిన్న లింగప్పగారి హరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు.



టవర్‌క్లాక్ వద్ద అస్తవ్యస్తంగా ట్రాఫిక్

అంతా.. మా ఇష్టం..!

- నగరంలో వాహనదారుల ఇష్టారాజ్యం
- ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించేవారు కరువు
- బైకులపై దూసుకుపోతున్న మైనర్లు
- బైక్ తీస్తే.. చెవిలో సెల్‌ఫోన్ ఉండాల్సిందే..!
- రాంగ్ రూట్.. ర్యాష్ డ్రైవింగ్..
- ద్విచక్రవాహనాలపై ముగ్గురు.. నలుగురు..

అనంతపురం క్రైం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ నిబంధనలు అమలు కావడం లేదు. రాంగ్ రూట్‌లో ప్రయాణించినా, సెల్‌ఫోన్‌లు చెవిలో పెట్టుకుని ఇష్టారాజ్యంగా వెళుతున్నా అడిగేవారు ఉండరు. రోడ్డు మీదే పార్కింగ్ చేస్తున్నారు. వాహనదారులకు స్వీయ నియంత్రణా లేదు. ఇతరులు ఇబ్బంది పడితే తమకేమిటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇక సర్కిళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండీ ప్రయోజనం కనిపించడం లేదు. కొన్ని పనిచేయవు. పని చేసేచోట పాటించేవారు లేరు. రద్దీ సమయంలో ట్రాఫిక్ జామ్ కావడం, అక్కడుండే సిబ్బంది తంటాలు పడటం తప్ప మార్పు రావడం లేదు. ఫలితంగా నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రతి నెలా వేల కేసులు



స్కూటర్‌పై నలుగురు.. ఆపై సెల్..

నగరంలో ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్ కేసులు వేలాదిగా నమోదవుతున్నాయి. ఈ మూడు రకాల ఉల్లంఘలనపై గత ఏడాది డిసెంబరులో 2,689, ఈ ఏడాది జనవరిలో 2,754, ఫిబ్రవరిలో 2,872 జరిమానాలు విధించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో రోజుకు సగటున 15 జరిమానాలు వేస్తుంటారు. నాలుగు పోలీస్‌స్టేషన్ల ప్రతి నెలా 1,800 పైగా కేసులలో జరిమానాలు విధిస్తుంటారు. ఇవన్నీ పోలీసులు ప్రత్యేకంగా తనిఖీ చేసిన సమయంలో నమోదైన కేసులే. మిగిలిన సమయాల్లో పరిస్థితి చెప్పాల్సిన పనే లేదు.

ఫైన్ ఆప్షన్ లేదట..!

ట్రిపుల్ రైడింగ్ కేసులలో జరిమానా విధించే ప్రత్యేక ఆప్షన్ పోలీసుల వద్ద లేదట. దీంతో డేంజరస్ డ్రైవింగ్ ఆప్షన్ కింద రూ.1035 జరిమానా విధిస్తున్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు రూ.1035 జరిమానా వేస్తారు. రాంగ్ రూట్‌కు కూడా ఆప్షన్ లేదట. దీనికి రాంగ్ పార్కింగ్ లేదా డేంజరస్ డ్రైవింగ్ కింద రూ.1035 జరిమానా విధిస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే రూ.135, విత్‌ఔట్ రిజిస్ట్రేషన్ రూ.2035 జరిమానా విధిస్తున్నారు. కారు, ఇతర పెద్ద వాహనాలకు విత్‌ఔట్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రూ.2,035, ఇన్సూరెన్స్ లేకపోతే రూ.1,035, నంబర్ సరిగా లేకపోతే రూ.135, కారులో సీటుబెల్టు, సైడ్ మిర్రర్ లేకపోతే రూ.135 జరిమానా విధిస్తున్నారు.

పాతూరు నుంచి బైపాస్ వరకు...

పాతూరులో ట్రాఫిక్ సమస్య దశాబ్దాలుగా పరిష్కారం కావడం లేదు. గాంధీబజార్, తిలక్ రోడ్డు, తాడిపత్రి బస్టాండ్ ప్రాంతాలు నిత్యం జనంతో కిటకిటలాడుతుంటాయి. అక్కడి నుంచి కళ్యాణదుర్గం, బళ్లారి బైపాస్ వరకు ట్రాఫిక్ జామ్ కనిపిస్తూనే ఉంటుంది. సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్‌లో వాహనాలు నిత్యం ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోతుంటాయి. క్లాక్‌టవర్ సర్కిల్‌లో ఫ్లై ఓవర్ బ్రిడ్జి పునర్నిర్మాణం తరువాత ట్రాఫిక్ గందరగోళంగా మారింది. ఎవరు ఎటు వెళ్తున్నారో, ఎలా వెళ్లాలో తెలియని పరిస్థితి. హైవే బైపాస్ వెంబడి తపోవనం సర్కిల్ నుంచి కళ్యాణదుర్గం, బళ్లారి బైపాస్, రుద్రంపేట బైపాస్ వరకు సమస్య తీవ్రంగా ఉంది. సర్వీస్ రోడ్డు మీద ఒక్కోసారి వందల కొద్దీ వాహనాలు నిలిచిపోతుంటాయి.



సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తున్న పోలీసులు



ఒకే బైక్‌పై నలుగురు

డ్రంకెన్ డ్రైవ్‌పైనే దృష్టి..

నగరంలో పోలీసులు ఎక్కువగా రాత్రి సమయాల్లో డ్రంకెన్ డ్రైవ్‌పైనే దృష్టి సారిస్తున్నారనే విమర్శలున్నాయి. ట్రాఫిక్ నియంత్రణకు సీఐ, నలుగురు ఎస్ఐలు, నలుగురు ఏఎస్ఐలు, 50 మంది వరకు హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఉన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించేవారి వాహనాలను ఫొటో తీసి గ్రూప్‌లో అప్‌లోడ్ చేస్తుంటారు. వాటి ఆధారంగా ఎ స్ఐలు, సీఐలు జరిమానా విధిస్తుంటారు. పగలంతా ట్రాఫిక్ సర్కిళ్లలోనే వీరి సమయం గడిచిపోతోంది. సాయంత్రం నుంచి రెండు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేయడానికి వెళ్లిపోతారు. నగరంలోని నాలుగు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతి రోజూ సాయంత్రం రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు సంబంధించిన జరిమానాలు వేస్తారు. కొన్ని సందర్భాల్లో మాత్రమే మధ్యాహ్నంలోపు రోడ్లపైకి వస్తారు.

మైనర్ల ఓవర్ స్పీడ్

నగరంలో 18 ఏళ్లలోపు పిల్లలు ఎక్కువ ద్విచక్ర వాహలను నడుపుతున్నారు. వీరి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు నెలల కిందట టూటౌన్ పోలీసులు విద్యుత్‌నగర్ సర్కిల్‌లో రెండు గంటల పాటు తనిఖీ చేస్తే 20మంది మైనర్లు బైక్‌లు నడుపుతూ పట్టుబడటం గమనార్హం. ప్రధాన రహదారుల్లో వీరి స్పీడును ఆపలేం. విద్యుత్ నగర్ సర్కిల్ నుంచి జేఎన్టీయూకు వెళ్లే రోడ్డు, జేఎన్టీయూ, ఎస్కేయూ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే రోడ్డు, సుభాష్‌రోడ్డు, శ్రీకంఠం నుంచి బస్టాండ్ మీదుగా గుత్తిరోడ్డు వైపు, గుత్తి రోడ్డు, రామ్‌నగర్, శ్రీనగర్ కాలనీ 80 అడుగుల రోడ్డు, బైపాస్‌లో వేగంగా దూసుకెళ్తున్నారు. వీరిని కట్టడి చేసే దిశగా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు.

మరింత శ్రద్ధ పెడతాం..

నగర పరిధి పెరిగింది. ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేస్తున్నా, వాటిని చూసి వెళ్లే పరిస్థితుల్లో వాహనదారులు లేరు. సిగ్నల్స్ వద్ద సిబ్బంది ఖచ్చితంగా ఉండాల్సిన పరిస్థితి. ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్‌పైనే ఎక్కువ జరిమానాలు విధిస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారి పై చర్యలు కొనసాగిస్తాం. మరింత శ్రద్ధ పెట్టి నియంత్రిస్తాం. ప్రజల్లోనూ మార్పు రావాల్సిన అవసరం ఉంది.

- రఘు ప్రసాద్, ట్రాఫిక్ సీఐ

కబ్జా చేసి.. కాంప్లెక్స్ కట్టి..!

రోడ్డు స్థలంలో వైసీపీ నాయకుడి దర్జా... సర్వేలో బట్టబయలు



వైసీపీ నాయకుడు నిర్మించిన కాంప్లెక్స్

బొమ్మనహాళ్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకుల భూకబ్జాలకు అంతేలేకుండా పోయింది. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో వైసీపీ నాయకుడు రాజ్‌కుమార్.. రోడ్లు, భవనాల శాఖ(ఆర్‌అండ్‌బీ)కి చెందిన స్థలాన్ని కబ్జా చేసి, ఏకంగా కాంప్లెక్స్ కట్టాడు. గురువారం అధికారుల సర్వేతో ఆక్రమణ బయటపడింది. రూ.75 లక్షల విలువచేసే ఐదు సెంట్ల స్థలాన్ని కబ్జా చేసినట్లు అధికారులు సర్వేలో తేల్చారు. ఉద్దేహాళ్‌లో వైసీపీ నాయకుడు రాజ్‌కుమార్‌కు 151వ సర్వే నంబరులో 23 సెంట్ల స్థలం ఉంది. ఇది బళ్లారి-కళ్యాణదుర్గం రహదారి పక్కన ఉంది. దీనికి ఆనుకుని 151వ సర్వే నంబరులో రోడ్డుకు చెందిన దాదాపు 5 సెంట్ల స్థలాన్ని మూడేళ్ల క్రితం వైసీపీ హయాంలో దర్జాగా కబ్జా చేసి, కాంప్లెక్స్ కట్టాడు.

గ్రామస్థుల ఫిర్యాదుతో సర్వే

ఆర్‌అండ్‌బీ స్థలాన్ని కబ్జా చేసినట్లు ఉద్దేహాళ్ గ్రామస్థులు.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, బొమ్మనహాళ్, కణేకల్లు ఎస్ఐలు నబీరసూల్, నాగమధు భద్రత కల్పించగా.. తహసీల్దార్ మునివేలు, సర్వేయర్ రవితేజ, ఆర్‌అండ్‌బీ డీఈఈ రవిశంకర్‌రెడ్డి, జేఈఈ నాగేంద్రప్రసాద్ సర్వే చేశారు. ఆర్‌అండ్‌బీ స్థలాన్ని కబ్జా చేసినట్లు తేల్చారు. ఆ మేరకు అధికారులు మార్కింగ్ వేశారు. సర్వే చేసే సమయంలో వైసీపీ నాయకుడు రాజ్‌కుమార్ కిందకు రాకుండా పైనే ఉండిపోయాడు. సర్వే చేసినట్లు సంతకం చేయాలని రెవెన్యూ అధికారులు కోరగా.. ససేమిరా అంటూ వెనక్కి పంపాడు. సర్వేపై తహసీల్దార్ మునివేలును అడగ్గా.. కబ్జా చేసినట్లు తేలిందన్నారు. త్వరలోనే నోటీసులు జారీ చేస్తామన్నారు.

రాజకీయ డ్రామాకు తెరలేపిన మెట్టు



ఉద్దేహాళ్‌లో సర్వే చేస్తున్న అధికారులు

ఉద్దేహాళ్‌లో వైసీపీ నాయకుడు రాజ్‌కుమార్ కబ్జా బాగోతం వెలుగులోకి రావడంతో కప్పిపుచ్చేందుకు వైసీపీ రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి రాజకీయ డ్రామాకు తెరలేపారు. గ్రామంలో వైసీపీ శ్రేణులతో కలిసి నినాదాలు చేసుకుంటూ బళ్లారి-కళ్యాణదుర్గం రహదారిపై ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో అనేక మంది రోడ్డును ఆక్రమించుకుని, నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు.

ఉత్కంఠ.. ఉద్రిక్తత..!

(3వ పేజీ తరువాయి)

సమన్వయం చేసుకున్నారు. రెండు స్థానాల్లో ఎన్నిక వాయిదా పడిన విషయాన్ని కలెక్టర్లు, ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఇద్దరికీ మద్దతు..!



పోలింగ్ కేంద్రం వద్ద మోహరించిన పోలీసులు

గాండ్లపెంట: ఎంపీడీఓ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమలు చేశారు. ఏడుగురు ఎంపీటీసీలలో ఉదయం 10 గంటలకు ఇద్దరు టీడీపీ ఎంపీటీసీలు జయరామిరెడ్డి, సోముశేఖర్‌రెడ్డి వచ్చారు. సోముశేఖర్ రెడ్డి నామినేషన్ వేశారు. కానీ కోరం లేక కాసేపు ఎన్నికల ప్రక్రియను ఆపేశారు. ఆ తరువాత వైసీపీ ఎంపీటీసీలు ముగ్గురు 11.30కు, మరొకరు 11.45కు వచ్చారు. కానీ వారెవరూ నామినేషన్ వేయలేదు. ఎన్నికల అధికారులు కల్పించుకుని, నామినేషన్ వేస్తున్నారా లేదా అని అడిగారు. దీంతో గంగోజమ్మతో నామినేషన్ వేయించారు. ముగ్గురు సభ్యులు ఆమెను బలపరిచారు. కానీ ఈ ముగ్గురిలో ఒకరు సోముశేఖర్ రెడ్డిని కూడా బలపరిచారు. దీంతో గందరగోళం ఏర్పడి, ఎన్నిక వాయిదా పడింది. పోలింగ్ కేంద్రానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వచ్చారు. ఇరువర్గాల నడుమ చిన్నపాటి వాగ్వాదాలు జరిగాయి. పోలీసులు సర్దిచెప్పి పంపించారు. ఆర్డీఓ వీవీఎస్ శర్మ, తహసీల్దారు బాబురావు, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి హాజరయ్యారు.

వండ్రయ్య ఏకగ్రీవం



కణేకల్లు: గరుడచేడుకు చెందిన ఎంపీటీసీ వండ్రయ్య ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనకు 14 మంది ఎంపీటీసీలు మద్దతు తెలిపారు. మారెంపల్లి ఎంపీటీసీ లీలావతి ఆయనను బలపరిచారు. ప్రిసైడింగ్ అధికారి భార్గవ్ వండ్రయ్యను ఎంపీపీగా ప్రకటించి, ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీపీ సంధ్య ఏడాది క్రితం రాజీనామా చేయడంతో తాజాగా ఎన్నిక జరిగింది.

రొద్దం ఎంపీపీగా నాగమ్మ

పెనుకొండ రూరల్: రొద్దం ఎంపీపీగా చిన్నమంతూరుకు చెందిన నాగమ్మ ఏకగ్రీవం అయ్యారు. ఎంపీపీ చంద్రశేఖర్ ఏడాదిక్రితం అనారోగ్యంతో మృతిచెందడంతో తాజాగా ఎన్నిక నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి విజయ్‌ప్రసాద్, ఎంపీడీఓ రాంకుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఎంపీటీసీ వనజ నాగమ్మ పేరును ప్రతిపాదించారు. పెద్దగువ్వలపల్లి ఎంపీటీసీ అనితలక్ష్మీ బలపరిచారు. మిగిలిన 15 మంది మద్దతు తెలిపారు.

మీకు మీరే.. మాకు మీమే..

రొద్దం ఎంపీపీ ఎన్నికల్లో శంకర్‌నారాయణ, ఉష శ్రీచరణ్ వర్గీయులు వేర్వేరుగా కూర్చున్నారు. ఎంపీపీగా ఎన్నికైన నాగమ్మ, మరో ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే ఉష శ్రీచరణ్ వద్దకు వెళ్లారు. మిగిలిన ఎంపీటీసీలు శంకర్‌నారాయణ వర్గం నాయకులతో కలిసి వెళ్లిపోయారు.



నాగమ్మకు మద్దతు ప్రకటిస్తున్న ఎంపీటీసీలు

కంబదూరులో హైడ్రామా

గొడవకు దిగిన మాజీ ఎంపీపీ... ప్రిసైడింగ్ అధికారికి అస్వస్థత... ఎంపీపీగా ఎన్నికైన లక్ష్మీదేవి



కంబదూరు ఎంపీపీగా డిక్లరేషన్ అందుకుంటున్న లక్ష్మీదేవి

కళ్యాణదుర్గం: కంబదూరు ఎంపీపీ ఉప ఎన్నిక ఉద్రిక్తత నడుమ జరిగింది. వైసీపీ నాయకులు హంగామా చేశారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ మద్దిలేటి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ ఉదయం మొదలైంది. వైసీపీ ఎంపీటీసీలు 13 మంది ఉదయం 11 గంటల సమయంలో విహార యాత్ర నుంచి నేరుగా ఎంపీడీఓ కార్యాలయం వద్దకు ప్రత్యేక వాహనంలో వచ్చారు. ఈ క్రమంలో చెక్‌పోస్టు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పోలీసులతో వైసీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. డీఎస్పీ రవిబాబు ప్రత్యేక బృందాలతో వచ్చి పరిస్థితిని అదుపు చేశారు. 11.30 గంటలకు నామినేషన్ల స్వీకరణ, ఎన్నికను ప్రారంభించారు. ఎంపీటీసీలతో ఓ నోట్ పుస్తకంలో సంతకాలు చేయించుకుంటుండగా, మాజీ ఎంపీపీ, ములకనూరు ఎంపీటీసీ తలారి తిమ్మరాజమ్మ వారితో వాగ్వాదానికి దిగారు. 'ఏం పాపం చేశారని అవమానిస్తున్నారు..?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీటీసీలు సంతకం చేసిన నోట్ పుస్తకంలోని ఓ కాగితాన్ని ఆమె ఒక్కసారిగా చించేశారు. ఎన్నికను ఎలా నిర్వహిస్తారో చూస్తానని అధికారులతో వాదనకు దిగారు. ఈ గొడవ కారణంగా ఆందోళన చెందిన ప్రిసైడింగ్ అధికారి మద్దిలేటి అస్వస్థతకు గురయ్యారు. ఆయనను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో ఎన్నిక వాయిదా పడుతుందని భావించారు. ఈలోగా జేసీ శివనారాయణ శర్మ అక్కడికి చేరుకుని, ఈవోఆర్డీ గూడెన్న, శెట్టూరు తహసీల్దారు ఈశ్వరయ్యశెట్టికి ఎన్నికల బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరిద్దరి సమక్షంలో ఎన్నిక సాఫీగా జరిగింది. రాళ్ల అనంతపురం ఎంపీటీసీ కురుబ లక్ష్మీదేవమ్మను ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈవో తిప్పయ్య, ఈవోఆర్డీ గూడెన్న ఆమె చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

టెన్షన్.. టెన్షన్..!



ఎంపీటీసీలతో వాహనంలో వెళ్తున్న వైసీపీ నాయకులు

రామగిరి/పెనుకొండ టౌన్/హిందూపురం: రామగిరి ఎంపీడీఓ కార్యాలయానికి ఇద్దరు వైసీపీ, ఒక టీడీపీ ఎంపీటీసీ మాత్రమే వచ్చారు. మిగిలిన ఆరుగురు వైసీపీ నాయకుల అధీనంలో ఉండిపోయారు. ఎన్నికల గడువు మధ్యాహ్నం 12 గంటల్లోగా వారు రాకపోవడంతో కోరం లేక శుక్రవారానికి వాయిదా వేస్తున్నామని ఎన్నికల అధికారి సంజీవయ్య ప్రకటించారు. ఎన్నికలకు శుక్రవారం హాజరు కావాలని సభ్యులకు నోటీసులు జారీ చేశారు. అప్పటికే పెనుకొండ నుంచి బయలుదేరి, కుంటిమద్ది వరకూ వచ్చిన వైసీపీ ఎంపీటీసీలు, ఎన్నిక వాయిదా విషయం తెలుసుకుని వెనుదిరిగారు. మరోవైపు ఎంపీడీఓ కార్యాలయం బయట ఉద్రిక్తత ఏర్పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వైసీపీ సభ్యుల కోసం అధికారులు ఉత్కంఠగా ఎదురుచూశారు. పేరూరు-2 ఎంపీటీసీ భారతిని తమకు తెలియకుండా తీసుకెళ్లారని, ఆమె వస్తే తమకు అప్పగించాలని కోరుతూ కుటుంబ సభ్యులు రామగిరి పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేచి చూశారు. మరో ఎంపీటీసీ బంధువులు కూడా అక్కడే ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో పోలీసులు 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలు చేశారు. అనుమతి ఉన్న వారినే లోనికి అనుమతించారు. శుక్రవారం కూడా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు.

పెనుకొండలో రచ్చ

రామగిరి ఎంపీపీ ఎన్నిక రాజకీయం గురువారం పెనుకొండకు మారింది. రామగిరి మండలంలో తొమ్మిది మంది ఎంపీటీలు ఉండగా.. ఇటీవల ఎంపీపీ నాగమ్మ మృతిచెందారు. మిగిలిన ఎనిమిది మందిలో ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఆరుగురు ఎంపీటీసీల ఆచూకీ తెలపాలని వారి కుటుంబ సభ్యులు పోలీసులను డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వారు తనవద్దే ఉన్నారని, పెనుకొండ తహసీల్దారు వద్ద హాజరు పరుస్తున్నానని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం తహసీల్దారును కలిసి, ఎంపీటీసీలను శుక్రవారం తానే స్వయంగా రామగిరికి తీసుకువస్తానని, అంతవరకూ వారి యోగక్షేమాలు తానే చూసుకుంటానని లిఖితపూర్వకంగా తెలియజేశారు. అలాంటి అనుమతి ఇచ్చే అధికారం తనకు లేదని, పోలీసులను సంప్రదించాలని తహసీల్దారు శ్రీధర్ ఆయనకు సూచించారు. ఇదే సమయంలో రామగిరికి చెందిన టీడీపీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పెనుకొండకు చేరుకున్నారు. వైసీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తహసీల్దారు కార్యాలయం వద్దకు వెళ్లారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



రోడ్డుపై బైఠాయించిన ఉష శ్రీచరణ్, గిరిజమ్మ

నీ అంతు చూస్తా..! రెచ్చిపోయిన మాజీ ఎమ్మెల్యే



వేలుచూపి డీఎస్పీ, సీఐని బెదిరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి

పెనుకొండ తహసీల్దారు కార్యాలయం వద్దకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి.. ఆగ్రహంతో ఊగిపోయారు. తహసీల్దార్ కార్యాలయంలోనికి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆయనను హిందూపురం డీఎస్పీ మహేష్, సీఐలు ఆంజనేయులు, నాగేంద్రబాబు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసు అధికారులు, ప్రకాశ్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం జరిగింది. అదే సమయంలో టీడీపీ నాయకులు అక్కడ కనిపించడంతో బూతు పురాణం మొదలు పెట్టారు. అంతు చూస్తానని వేలెత్తిచూపుతూ బెదిరించారు. పోలీసులు ఫ్యాక్షనిజాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. 'మీకు అధికారం ఎన్ని రోజులుంటుందో లెక్కపెట్టుకోండి' అని బెదిరించారు.

కిడ్నాప్ చేయలేదు..



పేరూరు-2 ఎంపీటీసీ భారతిని రామగిరి పోలీసులు గురువారం సాయంత్రం తహసీల్దారు ఎదుట హాజరుపరిచారు. వైసీపీ నాయకులు తనను కిడ్నాప్ చేశారని తన చెల్లెలు గంగరత్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారని, అది వాస్తవం కాదని తెలిపారు. తన చిన్న కూతురు ఆరోగ్యం బాగలేకుంటే చూసేందుకు వెళ్లానని అన్నారు. తన భర్త వైసీపీ నాయకుల అధీనంలో ఉన్నారని, శుక్రవారం జరిగే ఎంపీపీ ఎన్నికకు వెళ్లాలా లేదా అనేది ఇంకా నిర్ణయించుకోలేదని ఆమె తెలిపారు.

ఎన్ఎస్ గేటులో పోలీసు బందోబస్తు



ఎన్ఎస్ గేటులో పోలీసు బందోబస్తు

చెన్నేకొత్తపల్లి: రామగిరి ఎంపీపీ ఉప ఎన్నికను దృష్టిలో ఉంచుకుని పోలీసులు ఎన్ఎస్ గేటులో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రామగిరి వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. రాజకీయ నాయకుల వాహనాలను అనుమతించలేదు. వైసీపీ శ్రేణులు చెన్నేకొత్తపల్లికి, టీడీపీ శ్రేణులు ఎన్ఎస్ గేటు వద్దకు చేరుకున్నారు. పోలీసులు వారిని హెచ్చరించి పంపించారు. చెన్నేకొత్తపల్లి సమీపంలోని జాతీయ రహదారి పక్కన డాబా వద్ద జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైసీపీ శ్రేణులు గుంపుగా చేరడంతో పోలీసులు వారిని అక్కడికి నుంచి పంపించేశారు.



సీకేపల్లిలో ఓ దాబా వద్ద జడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ, వైసీపీ శ్రేణులు



పెనుకొండ తహసీల్దార్ ఎదుట ఎంపీటీసీలు



రామగిరిలో ఎంపీటీసీ సభ్యులను తనిఖీ చేస్తున్న పోలీసులు



రామగిరి ఎన్నిక కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

దొంగ చేతికి తాళాలు..!

(3వ పేజీ తరువాయి..)

తావిస్తోంది. నాలుగరోజుల క్రితం ఆ శాఖ రాష్ట్రస్థాయి డైరెక్టర్ నుంచి ఆ అవినీతి అధికారికి చిన్నపాటి మెమో జారీ చేశారు. జాయింట్ డైరెక్టర్ విచారణకు హాజరైన వార్డెన్ల పేర్లను ఆ మెమోలో పొందుపరచడం..., వారి ద్వారా 15 రోజుల్లోపు ఆధారాలు సేకరించి పంపాలని ఆ అవినీతి అధికారికే ఆదేశాలివ్వడం విడ్డూరం. దీని వెనుక పెద్ద తతంగమే నడిచిందన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఆరోపణలతో విచారణ ఎదుర్కొన్న అధికారికే ఆధారాలు సేకరించే బాధ్యతలు అప్పగించడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై విచారణ చేపట్టిన విషయం, అందులో వెల్లడైన అంశాలు, నివేదిక ఆధారంగా తీసుకున్న చర్యల వివరాలను సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మంత్రిని కూడా రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు తప్పుదోవ పట్టించారన్న విషయం స్పష్టమవుతోంది.

బహిర్గతం చేయడానికేనా..?

ఓ అధికారిపై అవినీతి ఆరోపణలు వచ్చినపుడు ఆయా శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులను విచారణాధికారులుగా నియమించడం సర్వసాధారణం. బాధితుల ద్వారా ఆధారాలు సేకరించడం విచారణాధికారి బాధ్యత. బాధితులు వెల్లడించిన అంశాల మేరకు నివేదిక తయారు చేయడం, దాని ఆధారంగా ఆ అధికారిపై చర్యలు తీసుకోవడం ఆ శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారిపై ఉంటుంది. శ్రీసత్యసాయి జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి విషయంలో మాత్రం అందుకు భిన్నంగా రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు వ్యవహరించారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి జారీ చేసిన మెమోనే ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి సంబంధించిన వివరాలను లిఖితపూర్వకంగా అందించిన వార్డెన్ల పేర్లు మెమోలో పొందుపరచడం అనుమానాలకు తావిస్తోంది. ఆ అవినీతి అధికారిని చర్యల నుంచి తప్పించే ప్రయత్నంలో భాగమే ఇది అనడంలో సందేహం లేదు. ఆ శాఖ వర్గాల్లోనూ అదే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిని బట్టి చూస్తే ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని వంత పా డుతూ.. వార్డెన్లను బలి చేసే ప్రయత్నమని స్పష్టమవుతోంది.

కాసులతో పావులు కదపడంతోనేనా..?

అవినీతి ఆరోపణలతో విచారణ ఎదుర్కొన్నా... బాధిత వార్డెన్ల నుంచి లిఖితపూర్వక వివరాలు సేకరించినా... ఆ అధికారిపై చర్యలు తీసుకోకపోవడం వెనుక భారీ తతంగమే నడిచినట్లు ఆ శాఖ వర్గాల ద్వారా అందిన సమాచారం. నివేదికను ఉన్నతాధికారికి మూడ్రోజుల్లో ఇస్తానని విచారణాధికారి శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేయడంతో తనపై ఎక్కడ చర్యలు తీసుకుంటారోనని ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి అప్రమత్తమైనట్లు సమాచారం. హుటాహుటిన విజయవాడ వెళ్లినట్లు తెలుస్తోంది. మూడ్రోజులపాటు అక్కడే తిష్ట వేసి, తనపై చర్యలు తీసుకోకుండా కాసులతో పావులు కదిపినట్లు సమాచారం. ఆ శాఖ రాష్ట్ర కార్యాలయంలో కీలక అధికారితో మంతనాలు జరపడం... రూ.లక్షల్లో చేతులు మారిన నేపథ్యంలోనే... ఆ అధికారిని చర్యల నుంచి తప్పించినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఆ శాఖలో ప్రస్తుతం ఇది హాట్ టాపిక్‌గా మారింది.

పోక్సో కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

అనంతపురం క్రైం, మార్చి27(ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్య ప్రవర్తనపై నమోదైన పోక్సో కేసులో ముద్దాయి దాసరి సురేష్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.1.50లక్షలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలిలా ఉన్నాయి. యాడికి మండలం కోన ఉప్పలపాడు(ప్రస్తుతం యాడికి మండల కేంద్రం లాలప్ప కాలనీ)కు చెందిన దాసరి సురేష్ 2021 సెప్టెంబరు 19న ఐదేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాత్‌రూమ్‌కు పిలుచుకెళ్లి అసభ్యంగా ప్రవర్తిస్తుండగా... బాలిక తండ్రి గమనించడంతో సురేష్ పారిపోయాడు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి యాడికి ఎస్ఐ రాంభూపాల్ పోక్సో కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి ఏడుగురు సాక్షులను విచారించారు. సురేష్‌పై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు.

దోపిడీ దొంగల బీభత్సం

రెండు పెట్రోల్ బంకుల లూటీ
సిబ్బందిని రాడ్లు, కర్రలతో బెదిరించి సొమ్ము దోచుకున్న వైనం...

ఉరవకొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. గురువారం తెల్లవారుజామున గంట వ్యవధిలోనే రెండు పెట్రోల్ బంకుల్లో డబ్బు లూటీ చేశారు. మండలంలోని ఆమిద్యాల, వజ్రకరూరు పెట్రోల్ బంకుల్లో రూ.3.70లక్షల నగదు దోచుకెళ్లారు. సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేశారు. ఈ దోపిడీ కలకలం రేపింది.

ఆమిద్యాల నుంచి వజ్రకరూరు..

ఉరవకొండ మండలంలోని ఆమిద్యాలలో గల రంగమ్మ ఫిల్లింగ్ స్టేషన్ వద్దకు బొలెరో వాహనంలో ముఖాలకు మాస్కులు ధరించిన ఆరుగురు కర్రలు, రాడ్లతో వచ్చారు. అక్కడ నిద్రిస్తున్న వాచ్‌మన్ రామాంజనేయులు, సిబ్బందిని లేపి రాడ్లు, కర్రలతో బెదిరించారు. మేనేజరు గదిలోని లాకర్లను తెరిపించి, అందులో భద్రపరిచిన రూ.2.50 లక్షల నగదును తీసుకుని, సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, హార్డ్ డిస్క్‌ను ఎత్తుకెళ్లిపోయారు. అనంతరం వజ్రకరూరులోని గుంతకల్లు రోడ్డులో గల శివశక్తి పెట్రోల్ బంకులోకి అదే ముఠా చొరబడింది. నిద్రిస్తున్న సిబ్బందిని లేపి రాడ్లు, కర్రలతో బెదిరించారు. డబ్బు ఎక్కడున్నాయని అడిగారు. సిబ్బంది వద్దనున్న ఫోన్లను లాక్కుని, చంపుతామని బెదిరించారు. సిబ్బంది కేకలు వేయడంతో వారిపై దాడి చేసి, బంకులో ఉన్న రూ.1.20 లక్షల నగదు తీసుకుని, ఉడాయించారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, క్లూస్‌టీం చోరీ జరిగిన పెట్రోల్ బంకులను పరిశీలించారు. దోపిడీ దొంగలు వాడిన వాహనానికి సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. క్లూస్ టీంలతో ఆధారాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రెక్కీ నిర్వహించారా..?

వజ్రకరూరు మండల కేంద్రంలో గుంతకల్లు రోడ్డులో ఉన్న శివశక్తి పెట్రోల్ బంకులోదోపిడీకి సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీ లభించింది. దొంగలు బొలెరో వాహనాన్ని పెట్రోల్ బంకు వద్ద ఆపి, అందులోని రాడ్లను తీసుకెళ్తున్న దృశ్యాలు నమోదయ్యాయి. దొంగలు హిందీ, తెలుగు మాట్లాడినట్లు బాధితులు తెలిపారు. దోపిడీ అనంతరం ముఠా సభ్యులు కొనకొండ్ల వైపు వెళ్లినట్లు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా గుర్తించారు. ఆమిద్యాలలో దోపిడీ జరిగిన వెంటనే పోలీసులు అప్రమత్తమై ఉండుంటే వజ్రకరూరులో నియంత్రించి ఉండవచ్చని ప్రజలు పేర్కొంటున్నారు. దోపిడీకి ముందు రెక్కీ దొంగలు నిర్వహించారా.., పక్కా ప్రణాళికతో పాత నేరస్థులే చేశారా అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వజ్రకరూరులో దోపిడీ జరిగిన పెట్రోల్ బంకును డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు.

న్యూస్ బాక్స్

దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు కృషి : ఏఎస్పీ



దివ్యాంగుల హక్కుల చట్టం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ, డీఎస్పీ

అనంతపురం అర్బన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అనంతపురం ఏఎస్పీ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తెలుగులో రూపొందించిన దివ్యాంగుల హక్కుల చట్టం పుస్తకాలను అనంతపురం అర్బన్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీఎండీ షఫి, ఉమ్మడి జిల్లా కో - ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, లీగల్ సలహాదారుడు జెన్నే ఆనంద్, జిల్లా అధ్యక్షుడు ఆంజినేయులు, కార్యదర్శి రసూల్‌తో కలిసి ఏఎస్పీ ఆవిష్కరించారు. ఆ సంఘం నాయకులు సర్ఫున్నిసా, లక్ష్మీదేవి, లక్ష్మన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవారత్న అవార్డుకు ఎంపిక

అనంతపురం సెంట్రల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సర్వజన మందిర్ సేవా సొసైటీ జాతీయ ఉత్తమ సేవారత్న అవార్డుకు ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధికార ప్రతినిధి డాక్టర్ అక్కులప్ప ఎంపికయ్యారని ఆ సంస్థ వ్యవస్థాపకుడు సాయి శ్రీనివాస్ గురువారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక సేవా రంగాల్లో సేవలందించిన వారికి ఈనెల30న విజయవాడలో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఏఐ నైపుణ్య శిక్షణ తరగతులు

అనంతపురం సెంట్రల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అంశంపై మూడు రోజుల నైపుణ్యా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర గురువారం తెలిపారు. కోయెనిగ్ సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం మైక్రో సాఫ్ట్ ఏఐ స్కిల్స్ వర్క్‌షాప్‌ను చేపట్టిందన్నారు. శుక్రవారం నుంచి వర్సిటీ భువనవిజయం ఆడిటోరియంలో నిర్వహిస్తామన్నారు.

పరిహారం పంపిణీ

అనంతపురం న్యూటౌన్ మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సర్కిల్ కన్జర్వేటర్ యశోదాబాయి, జిల్లా అటవీ శాఖాధికారి విఘ్నేష్ ఉత్తర్వుల మేరకు కళ్యాణ దుర్గం రేంజ్ పరిధిలో వన్యప్రాణుల దాడిలో గాయపడిన వారు, పశువులు, మేకలు, గొర్రెలు, పంటలు నష్టపోయిన 27 మందికి రూ.6.23 లక్షలు చెక్కుల రూపంలో నష్ట పరిహారం అందజేసినట్లు కళ్యాణదుర్గం రేంజర్ మధుబాబు తెలిపారు. వారికి గురువారం కళ్యాణదుర్గం రేంజ్ కార్యాలయంలో చెక్కులు అందజేసినట్లు తెలిపారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న అక్షయపాత్ర ట్రస్టు నిర్వాహకులు

అనంతపురం కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో అక్షయపాత్ర ట్రస్టు ఆధ్వర్యంలో బాటసారులకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. గురువారం పాతూరు నంబర్-2 పాఠశాల వద్ద దాదాపు 1500 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. మరో రెండు నెలలపాటు రోజూ ప్రజలకు మజ్జిగ పంపిణీ చేపట్టనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు సురేష్ వెల్లడించారు.

అనాథలకు వస్త్రాల వితరణ

అనంతపురం కల్చరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని గురువారం ఆదరణ సేవా హోమ్‌లోని వృద్ధులు, అనాథలు, చిన్నారులకు నూతన వస్త్రాలు వితరణ చేశారు. పామిడికి చెందిన పీఎస్ కృష్ణకుమార్, అనుపమ ఆశ్రమంలోని వారందరికీ నూతన వస్త్రాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆదరణ సేవా హోమ్ నిర్వాహకుడు తాడిమర్రి లాల్‌బాషా, శ్రీనివాసరావు, సరళ, శ్రీలత, శ్రీనాథ్, దీపిక తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, మార్చి27(ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని సంత్రగాచి-యశ్వంతపూర్-సంత్రగాచి మధ్య (వయా అనంతపురం) ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. సంత్రగాచి-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (నం.02863) ఏప్రిల్ 3, 10, 17, 24 తేదీల్లో (గురువారాల్లో) నడపనున్నట్లు తెలియజేశారు. ఈ రైలు సంత్రగాచిలో పేర్కొన్న తేదీల్లో గురువారం మధ్యాహ్నం 12.50 గంటలకు బయలుదేరి శనివారం తెల్లవారుజామున 12.55 గంటలకు యశ్వంతపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు ఏప్రిల్ 5, 12, 19, 26 తేదీల్లో (శనివారాల్లో) తెల్లవారుజామున 4.30 గంటలకు యశ్వంతపూర్‌లో బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 1.25 గంటలకు సంత్రగాచికి చేరుకుంటుందన్నారు. ఈ రైలు ఖరగ్‌పూర్, బిలాస్‌పూర్, బలార్షా, కటక్, భువనేశ్వర్, ఖుర్దా రోడ్, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, సింహాచలం నార్త్, దువ్వాడ, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నరసరావు పేట, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, హిందూపురం స్టేషన్ల మీదుగా వెళ్తుందని తెలిపారు.

వ్యాను, కారు ఢీ - ఏడుగురికి గాయాలు

బత్తలపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పర్లపల్లి క్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు ఉపాధ్యాయులు గాయపడ్డారు. మండలంలోని నల్లబోయనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసే తొమ్మిది మంది గురువారం విధులు ముగించుకొని ప్రత్యేక వ్యాన్‌లో అనంతపురం బయలుదేరారు. ఉప్పర్లపల్లి క్రాస్ వద్ద, కదిరి వైపు నుంచి వస్తున్న కారు ఈ వ్యాన్‌ను ఢీకొంది. దీంతో వ్యాన్ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో ఉమాదేవి, ఆనంద్‌రెడ్డి, విశాల, పార్వతమ్మ, బిల్లే ఉమాదేవి, రామచంద్ర, చాంద్‌బాష గాయపడ్డారు. వారిని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

డివైడర్‌ను ఢీ కొన్న ఆటో

అనంతపురం క్రైం, మార్చి27(ఆంధ్రజ్యోతి): నగర శివారులో ఆటో డివైడర్‌ను ఢీ కొంది. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాలేదు. ఎస్కేయూ నుంచి ప్రధాన రహదారిలో అనంతపు రం వైపు ఓ కారు, ఆటో పక్కపక్కగా వస్తున్నాయి. ప్రయాణికులతో వస్తున్న ఆటో కారును దాటే ప్రయత్నం చేసింది. ఆ కారు తోలే వ్యక్తి ఆటో ముందుకు కారును రానిచ్చాడు. ఆటోను ఢీ కొడుతుందనే భయంతో ఆటోవాలా పక్కకు తిప్పాడు. దీంతో డివైడర్‌ను ఎక్కేసింది. ఈ ఘటనలో ఓ మహిళకు స్వల్పగాయాలయ్యాయి.



డివైడర్‌ను ఎక్కిన ఆటో

పెద్దాసుపత్రిలో మల్టీలెవల్ పార్కింగ్..!

- పెద్ద నగరాల్లో తరహాలో మూడు ఫ్లోర్లు
- ఒక్కో ఫ్లోర్‌లో 9 నుంచి 10 కార్లకు అవకాశం
- ఇంజినీర్ల ప్లాన్‌కు కలెక్టర్ ఆమోదం



మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటు చేసే ప్రాంతం

అనంతపురంటౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఎట్టకేలకు వాహనాల పార్కింగ్ సమస్యకు పరిష్కారం చూశారు. నిత్యం వందల మంది రోగులు చికిత్స కోసం వివిధ రకాల వాహనాల్లో ఆస్పత్రికి వస్తున్నారు. మరోవైపు డాక్టర్లు, సిబ్బంది వందల మంది పనిచేస్తున్నారు. డాక్టర్లు అధికంగా సొంత కార్లలో విధులకు వస్తారు. అయితే వాహనాల పార్కింగ్‌కు సరైన స్థలం లేకపోవడంతో ఆస్పత్రిలో ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలిపి వెళుతున్నారు. అత్యవసర కేసులు వచ్చినపుడు క్యాజువాలిటీకి వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సివస్తోంది. ఇంకోవైపు వాహనాల దొంగతనాలు అధికంగానే జరుగుతున్నాయి. రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు ఆస్పత్రికి వచ్చినపుడు ఇక్కడి పరిస్థితిని చూసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం, ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించి వెళ్లడం చాలా ఏళ్లుగా జరుగుతూనే వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత కలెక్టర్ వినోద్ కుమార్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. పార్కింగ్ ఏర్పాటు వ్యవహారాన్ని నగరపాలక సంస్థకు అప్పగించారు.

మూడు ఫ్లోర్ల ఏర్పాటు

ఆస్పత్రిలో స్థల సమస్య ఉండడంతో ఇంజినీర్లు పెద్ద పెద్ద నగరాలలో మాదిరిగా మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఇంజినీర్లు నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్లాన్‌ను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆమోదించారు. దీంతో వారం కిందట నగరపాలక ఇంజినీర్లు, వైద్య విభాగం ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లు ఆస్పత్రిలో మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ప్రస్తుతం డాక్టర్లు కార్లు నిలబెడుతున్న ప్రాం తంలో ఇందుకోసం మూడుఫ్లోర్లు నిర్మించాలని వారు ప్లాన్ వేశారు. దీని ప్రకారం ఒక్కో ఫ్లోర్‌లో 9నుంచి 10కార్లు పార్కింగ్‌చేయడానికి అవకాశం ఉంటుందని ఇంజినీర్లు చెబుతున్నారు.

కలెక్టరు ఆమోదం మేరకే...



జిల్లా ఆస్పత్రిలో స్థల సమస్య వల్ల వాహనాల పార్కింగ్‌కు అనేక ఇబ్బందులు ఉన్నాయి. దీంతో ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించడమేకాక ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. నగరపాలక ఇంజినీర్లకు నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. ఇంజినీర్లు వారం క్రితం ఆస్పత్రిలో పరిశీలించి స్థలాన్ని నిర్ణయించారు. అక్కడ మూడు ఫ్లోర్లతో పార్కింగ్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ ప్రక్రియ అంతా నగరపాలక ఇంజినీర్ల చేతుల్లోనే కొనసాగుతుంది. దీంతో వాహనాల పార్కింగ్ సమస్య తీరే అవకాశం ఉంది.

- డాక్టరు వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

అభివృద్ధి ఎవరు చేశారో నిలదీయండి

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పరిటాల సునీత



సుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానం ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు మార్చి27(ఆంధ్రజ్యోతి): 'మండలంలో ఎవరు అభివృద్ధి పనులు చేశారు? నీళ్లు ఎవరు తెచ్చారు?' అని వైసీ నాయకులను నిలదీసి అడగండని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఎమ్మెల్యే గురువారం మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ. 1.20కోటితో నిర్మంచిన తలుపూరు తారురోడ్డు, రూ.15లక్షలుతో నిర్మించిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం గ్రామానికి తారురోడ్డు వేసి వచ్చానన్నారు. పరిటాల రవీంద్ర ట్రస్టు ద్వారా రూ. లక్షతో ప్రత్యేక లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఇటీవల వైసీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అలాంటి వారిని గట్టిగా నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలో ఉండగా ఎలాంటి అభివృద్ధి చేయలేనివారు ఇప్పుడు ఇలామాట్లడటం ఏమిటని నిలదీయాలన్నారు. గ్రామాల్లో కక్షలు సృష్టించేవారుంటారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎయిర్‌పోర్టు విషయంలో, పుకార్లు నమ్మి ఆందోళనచెందవద్దన్నారు. అనంతరం పంపనూరులోని ఆలయ ముఖద్వారాన్ని, ఆలయంలో కూలర్లు, చలవేంద్రాన్ని ప్రారంభించారు. టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజి, కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు నెట్టెం వెంకటేశులు, నారాయణస్వామి, కృష్ణమోహన్‌చౌదరి, శశాంక చౌదరి, అనిల్ చౌదరి, మనోరంజన్, శ్రీనివాస రెడ్డి, కందుకూరి ఓబుళపతి, రామదాసు అక్కులన్న, సత్య రంగయ్య పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా ప్రభుత్వం

స్థానిక ముస్లింలకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఇఫ్తార్ విందుతో పాటు రంజాన్ తోఫాతో పంపిణీ చేశారు. కమ్యూనిటీ భవనం, కబరస్థాన్ ప్రహరీ నిర్మించడంతో ముస్లింలు సంతోషం వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చి గజమాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే ఉపవాసమున్న ముస్లింలకు కర్జూరాలు, పండ్లు అందించారు. అనంతరం భోజనం వడ్డించి వారితో కలసి ఇఫ్తార్ చేశారు. రంజాన్‌తోఫా పంపిణీ చేశారు. ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

రీ ఇంటర్వ్యూకు 16 మంది హాజరు

అనంతపురం విద్య, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖలో ఒక పోస్టుకు దరకాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో రీ ఇంటర్వ్యూ నిర్వహించారు. అనంతపురం అర్బన్ ప్రాజక్టు పరిధిలోని ఎర్రనేలకొట్టాల అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించి గతంలో నోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే ఫిర్యాదులు ఎక్కువగా రావడంతో...కలెక్టర్ మరోసారి ఇంటర్వ్యూలు చేయాలని ఆదేశించారు. దీంతో అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, పీడీ నాగమణి, సీడీపీఓ లలిత, డాక్టర్ నారాయణ స్వామి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు చేశారు. 20 మంది హాజరుకావాల్సి ఉండగా ఇంటర్వ్యూకు 16 మంది హాజరయ్యారు. సోమవారం తర్వాత ఫలితాలు వెల్లడించే అవకాశం ఉందని ఐసీడీఎస్ అధికార వర్గాలు తెలిపాయి.

ఇఫ్తార్ విందు



ముస్లింలకు పండ్లు తినిపిస్తున్న టీడీపీ నాయకులు రామలింగారెడ్డి, పర్వతనేని శ్రీధర్‌బాబు

బుక్కరాయ సముద్రం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ హయాంలోనే అన్ని రంగాలలో మైనార్టీల అభివృద్ధి జరిగిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురష్కరించుకుని గురువారం మండల పరిధిలోని పొడరాళ్ల గ్రామంలో టీడీపీ మైనార్టీ నేతలు, గ్రామంలోని ముస్లింలు ఇచ్చిన ఇఫ్తార్ విందుకు టీడీపీ నాయకులు రామలింగారెడ్డి, పర్వతనేని శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఉపవాసం ఉన్నవారికి పండ్లు, ఫలహారం అందించారు.. అనంతరం ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నేతలు గౌస్, ఆలీ, ఏకాంబర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఈశ్వరయ్య రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

'సత్యసాయి జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి'

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి27(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంతిని జాతీయ సెలవుదినంగా ప్రకటించాలని భట్రాజుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కిరాజు నాగరాజు కోరారు. ఆయన గురువారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో మీడియా సమావేశంలో మాటాడుతూ.... జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని దిగ్విజయం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేయడం శుభపరిణాం అన్నారు. ఉత్సవాలకు తమవంతు కృషిచేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి సంఘం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భట్రాజుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, కోశాధికారి అక్కిరాజు మారుతీప్రసాద్, నాయకులు అబ్బరాజు వెంకటనారాయణ, అక్కిరాజు సుధాకర్‌రాజు, రత్నాకరం భట్టు మనోహర్‌కుమార్, అక్కిరాజు గోవిందరాజులు పాల్గొన్నారు.

ఆ రోజుల్లోనూ రిజిస్ట్రేషన్..!


అనంతపురం క్రైం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పర్వదినాల్లోనూ రిజిస్ట్రేషన్‌లు చేస్తామని స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖ ప్రకటించింది. ఈ నెల 30, 31 తేదీలను పనిదినాలుగా ప్రకటిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30న ఉగాది, 31న రంజాన్ పండుగలు ఉన్నాయి. ఆ రోజుల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయి.

ఒకటి నుంచి మార్పులు : రిజిస్ట్రేషన్‌ల శాఖలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం మార్పులను ప్రవేశపెట్టింది. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాల్లో నిరీక్షించే అవసరం లేకుండా, ముందస్తుగా స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయనుంది. ఒకటో తేదీ నుంచి స్లాట్ బుక్ చేసుకుని, నిర్ణీత సమయానికి వెళితే రిజిస్ట్రేషన్ చేస్తారు.

పీఎంజేవై కార్డుకు దరఖాస్తు చేసుకోండి : ఏడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 70 సంవత్సరాలు నిండిన వృద్ధులు పీఎంజేవై(ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన)కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ వినోద్ అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం ద్వారా 70 ఏళ్లు నిండిన వయోవృద్ధులకు రెండు వేల వైద్య విధనాలకు సంబంధించిన చికిత్సలు అందుతాయన్నారు. రూ.5 లక్షలు ఉచిత ఆరోగ్య రక్షణ అందుతుందన్నారు. అర్హులైన వారు www.beneficiary.nha.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నెం 14555కి సంప్రదించాలన్నారు.

అనంత యువతికి అమెరికాలో మెడికల్ పీజీ సీటు



లోహితాస్య

అనంతపురం టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన చుండూరు లోహితాస్య నంద్యాల శాంతిరామ్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అమెరికాలో పీజీ చదవాలని ఆమె వివిధ దశలలో నిర్వహించే ప్రవేశ పరీక్షలు, ఇంటర్వ్యూలలో పాల్గొని అత్యుత్తమ ప్రతి కనపరిచారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఆమె అమెరికాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఒక్లహోమా వైద్యవిశ్వవిద్యాలయంలో ఎండీ ఇంటర్నల్ మెడిసన్ విభాగంలో పీజీసీటు సాధించారు. లోహితాస్య తండ్రి డాక్టరు సుబ్రహ్మణ్యం పశు సంవర్ధకశాఖలో అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేస్తుండగా, తల్లి సి. వెంకటనారాయణమ్మ రెవెన్యూశాఖలో కర్నూల్ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ)గా ప్రస్తుతం పనిచేస్తున్నారు.

'దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ రాజ్యాంగ విరుద్ధం'

అనంతపురం టౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ, ఎస్టీ హక్కులవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య పేర్కొన్నారు. ఆయన గురువారం వేదిక నాయకులతో పాటు కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ మలోలను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఏపీ సూపర్‌కప్ విజేత గోదావరి

- రన్నరప్‌గా నిలిచిన కొల్లేరు జట్టు



మాట్లాడుతున్న ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఏపీ సూపర్ కప్ - 2025 ఫుట్‌బాల్ పోటీల విజేతగా గోదావరి క్లబ్ జట్టు నిలిచింది. నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో గురువారం ఫైనల్స్ నిర్వహించారు. లీగ్ పోటీల్లో ముందంజలో ఉన్న కొల్లేరు 18 పాయింట్లు, గోదావరి 15 పాయింట్లు సాధించి ఫైనల్స్‌లో తలపడ్డాయి. ఎక్కడా ఓటమి లేకుండా ఫైనల్స్‌కు చేరిన కొల్లేరు జట్టుపైనే అందరూ ఆశలు పెట్టుకున్నారు. అనూహ్యంగా పుంజుకున్న గోదావరి జట్టులో దిలీప్, అక్షయ్ చెరో గోల్ చేశారు. కొల్లేరు జట్టులో సూర్య మాత్రమే గోల్ కొట్టాడు. దీంతో గోదావరి జట్టు ఒక గోల్ తేడాతో విజయం సాధించి ఏపీ సూపర్ కప్ -2025 మొదటి ట్రోఫీని సొంతం చేసుకుంది. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ చేతుల మీదుగా విజేత జట్టుకు కప్‌తో పాటు రూ.5లక్షల నగదు బహుమతి అందజేశారు. రన్నరప్‌తో సరి పెట్టుకున్న కొల్లేరు జట్టుకు కప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ... కరవుసీమగా పేరొందిన అనంతపురం జిల్లాలోని క్రీడలు, క్రీడాకారులకు ఆర్డీటీ గొప్పవరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఫుట్‌బాల్‌కు ఉన్న ఆదరణను జిల్లా, రాష్ట్రంలోని అందరికీ చేరువచేయాలనే లక్ష్యంతోనే ఏపీ సూపర్‌కప్ ఫుట్‌బాల్ లీగ్ పో టీలను తీసుకొచ్చామని తెలిపారు. వచ్చే ఏడాది రెండో ఏపీ సూపర్‌కప్ విజేతకు రూ. 25లక్షలు నగదు బహుమతి చెల్లించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర టెక్నికల్ డైరెక్టర్ సుధాకర్, ఉపాధ్యక్షుడు సరిపూటి వేణుగోపాల్, మస్టర్ సీఈఓ గాయత్రి, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మల్లేష్, ప్రతినిధులు చిన్నబాబు, చక్రవర్తి, రాజేష్, శేషగిరిరావు, నీలాద్రి, రెడ్డప్ప, నాగరాజు, అనిల్, సుబ్రహ్మణ్యం, సిరాజుద్దీన్, పవన్, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల్లో పసుపు జెండా ఎగరాలి

- ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన

అనంతపురం అర్బన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం రోజు అర్బన్ నియోజకర్గంలోని అన్ని డివిజన్లు, పంచాయతీల్లో పసుపు జెండా ఎగరాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఆయన గురువారం పలువురు ముఖ్య నాయకులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈనెల 29న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించినట్లు నాయకులు తెలిపారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో సామాన్య కార్యకర్త నుంచి నాయకుల వరకు అందరూ భాగస్వామ్యులు కావాలని సూచించారన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

శింగనమల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ఎనిమిది మందికి మంజూరైన రూ. 11,50,193 చెక్కులను గురువారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలోనే పేదలకు భరోసా అన్నారు..

ఫ్లెక్సీ తెచ్చిన తంటా

- రెండు వర్గాల ఘర్షణ... నలుగురికి గాయాలు

గార్లదిన్నె, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరులో గురువారం వైసీపీ, టీడీపీ వర్గీయులు ఘర్షణ పడగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కల్లూరు కొండకింద కొట్టాలలో నివాస ముంటున్న బేడ బుడగ సంఘం కులస్థులు ఈ నెల 11న సుంకులమ్మ జాతర జరిపారు. ఈ సందర్భంగా టీడీపీ వర్గీయులు టీడీపీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. 'మా ఇంటి వద్ద మీ ఫ్లెక్సీ ఎందుకని వైసీపీ వర్గీయులు సోమశేఖర్, రామాంజి దానిని తొలగించారు. దీంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తిరిగి గురువారం సాయంత్రం వైసీపీకి చెందిన సోమశేఖర్, రామాంజి, మరొ కొందరు, టీడీపీ వర్గీయులు సింహాద్రి, ఆంజనేయులు ఘర్షణకు పాల్పడ్డారు. ఈ ఘర్షణలో రెండు వర్గాలకు చెందిన నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని పామిడి, అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఘర్షణకు సంబంధించి వివరాలను ఆరా తీశారు.

నేడు జిల్లాస్థాయి ఇఫ్తార్ వేడుకలు: ఏడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి27(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఇఫ్తార్ వేడుకలు శుక్రవారం నిర్వహించనున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి ప్రకటనలో తెలిపారు. సాయినగర్‌లోని అంబేద్కర్ భవన్‌లో సాయంత్రం 6 గంటలకు వేడుకలు ఉంటాయన్నారు. ముస్లింలు హాజరుకావాలని కోరారు.

టీటీసీ శిక్షణకు దరఖాస్తులు

అనంతపురం విద్య, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో 42 రోజులపాటు నిర్వహించే టీటీసీ శిక్షణకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏప్రిల్ 3 నుంచి 25వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు మే 1 నుంచి జూన్ 11వ తేదీ వరకూ నగరంలోని నంబర్ 2 స్కూల్‌లో శిక్షణ ఉంటుందన్నారు.

సర్వజనాస్పత్రిలో ఉత్తమ సేవకులకు సత్కారం



డాక్టరు ఆత్మారామ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో రోగులకు ఉత్తమ సేవలు అందించిన వారిని సత్కరించే కొత్త సంప్రదాయానికి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ డిప్యూటీ కలెక్టరు మల్లికార్జున రెడ్డి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా 360 సర్జరీలు చేయడంతో ఆర్థోవిభాగం హెచ్ఓడీ డాక్టరు ఆత్మారామ్ ఉత్తమసేవకుడిగా ఎంపికచేశారు. స్టాఫ్‌నర్స్ రాజేశ్వరి, సెక్యూరిటీ శోభారాణి, ఎం ఎన్ఓ రాజశేఖర్‌ను ఉత్తమ సేవకులుగా గుర్తించారు. వారిని గురు వారం సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి, ఆర్ఎంఓ డాక్టరు రామక్రిష్ణ చేతుల మీదుగా సత్కరించి మె మెంటో, బహుమతి అందించి అభినందించారు. ఇలా అన్ని విభాగాల డాక్టర్లు, సిబ్బంది పనిచేస్తూ ఆస్పత్రికి మంచిపేరు తీసుకురావాలని కోరారు.

ఎన్‌ఆర్ఐ విభాగ కోఆర్డినేటర్‌గా సాంబశివారెడ్డి



అనంతపురం క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎన్ఆర్ఐ విభాగ కోఆర్డినేటర్‌గా ఆలూరు సాంబశివారెడ్డిని నియమించారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. ఆ బాధ్యత తనకు అప్పగించడాన్ని ఒక గౌరవంగా, బాధ్యతగా భావిస్తున్నాని సాంబశివారెడ్డి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైసీపీ అభిమాను లందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చే అవకాశం ఇదేనని నమ్ముతున్నా నన్నారు. ఎన్ఆర్ఐలతో పార్టీకి సుస్థిరమైన సంబంధాన్ని ఏర్పరచడం తన ప్రధాన బాధ్యత అన్నారు. విదేశాల్లో ఉన్న వైసీపీ కార్యకర్తలతో చక్కటి సమన్వయం కల్పించడం, డిజిటల్ ప్రచారం, కార్యక్రమాల ద్వారా పార్టీ అభిప్రాయాన్ని గ్లోబల్ డైస్పోరా వరకు తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యాలన్నారు. ప్రతి దేశంలో నమ్మకమైన ఎన్ఆర్ఐ చాప్టర్లు ఏర్పాటు చేసి, కార్యకర్తలకు స్పష్టమైన మార్గనిర్దేశనం కల్పిస్తానన్నారు.

పీవీకేకేలో ముగిసిన పారిశ్రామిక అభివృద్ధి కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న ట్రైనర్లు, ప్రిన్సిపాల్, విద్యార్థులు

అనంతపురం రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో మూడురోజులుగా జరుగుతున్న పారిశ్రామిక అభివృద్ధి కార్యక్రమం గురువారం ముగిసింది. విద్యార్థులకు సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. కార్పొరేట్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వహీదా పరివీన్, నోట్ స్పీకర్ రాజ్యలక్ష్మి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్డానా పాల్గొన్నారు.

కళాజాతా

శింగనమల మార్చి27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మేపల్లిలో గురువారం సర్పంచ్ దేగల లలితమ్మ, రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ కార్యనిర్వహక కారదర్శి దేగల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వచ్ఛ సంకల్ప కళాజాతా నిర్వహించారు. గ్రామంలో పరిశుభ్రత పాటించాలని, తడి, పొడిచెత్త వేర్వేరుగా చేపట్టాలనీ, ప్రతి ఇంటి దగ్గర మొక్కలు నాటాలని కళాకారులు ఆటపాటల ద్వారా ప్రజలకు వివరించారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ప్రజలు పాల్గొన్నారు.

తాగునీటి పైప్ లైన్ పనులు ప్రారంభం

విడపనకల్లు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని హావళిగి, పాల్తూరు, కరకముక్కల తదితర గ్రామాల్లో తాగు నీటి శాశ్వత పరిష్కారానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు సహకారంతో మండల టీడీపీ నాయకులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బొల్లన గుడ్డం నుంచి హావళిగి పంప్ హౌస్ వరకూ 10.50 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ పనులను గురువారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పైప్ లైన్ పనులు పూర్తయితే పాల్తూరు, హావళిగి, కరకముక్కల, గాజుల మల్లాపురం, ఉండబండ, చీకలగురికి గ్రామాల్లో ప్రజలకు తాగు నీటి సమస్య తీరినట్లేనని తెలిపారు. ఈ గ్రామాల్లో తాగు నీటి కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడుతుండేవారని, గత వైసీపీ ప్రభుత్వంలో నెలలో ఒక్కసారి కూడా తాగు నీరు వచ్చేది కాదని, కొత్త ప్రభుత్వం ఏర్పాటై పయ్యావుల కేశవ్ మంత్రి అవగానే.. తాగునీటి సమస్యల పరిష్కారంపై చొరవ చూపారని చెప్పారు. ఈ క్రమంలో ప్రభుత్వంతో చర్చించి రూ.11.56 కోట్లు నిధులను విడుదల చేయించి పైప్‌లైన్ పనులు ప్రారంభించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బద్రీనాథ్, సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆ రోజుల్లోనూ రిజిస్ట్రేషన్..!

అనంతపురం క్రైం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పర్వదినాల్లోనూ రిజిస్ట్రేషన్‌లు చేస్తామని స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖ ప్రకటించింది. ఈ నెల 30, 31 తేదీలను పనిదినాలుగా ప్రకటిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30న ఉగాది, 31న రంజాన్ పండుగ ఉన్నాయి. ఆ రోజుల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయి.

ఒకటి నుంచి మార్పులు

రిజిస్ట్రేషన్‌ల శాఖలో వచ్చే నెల 1వతేదీ నుంచి ప్రభుత్వం మార్పులను ప్రవేశపెట్టింది. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాల్లో నిరీక్షించే అవసరం లేకుండా, ముందస్తుగా స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయనుంది. 1వ తేదీ నుంచి స్లాట్ బుక్ చేసుకుని, నిర్ణీత సమయానికి వెళితే రిజిస్ట్రేషన్ చేస్తారు.

గుత్తి మాజీ ఎంపీపీపై కేసు నమోదు

అనంతపురం క్రైం,మార్చి27(ఆంధ్రజ్యోతి): గుత్తి మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి, ఆయన కుమారుడు నిషాంత్‌తోపాటు మరికొందరిపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం కోనామురళీధర్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన ఘటనలో టీడీపీ నాయకుడు ప్రతాప్, చిన్నతో పాటు 84మందిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. గురువారం ప్రతాప్ ఫిర్యాదు మేరకు కోనా మురళీధర్‌రెడ్డి, అతని కుమారుడిపై కేసు నమోదు చేశారు. తమను బెదిరించారని, వారి నుంచి ప్రాణహాని ఉందని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పాలిసెట్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోండి

గుంతకల్లు టౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ 2025 అభ్యర్థులు పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్‌పీ రమణారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. మార్చి 12నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని ఏప్రిల్ 15వ తేదీ లోపు దరఖాస్తులను పాలిటెక్నిక్ కళాశాలలో సమర్పించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100, బీసీ, ఓసీలకు రూ.400 చెల్లించాలన్నారు. పరీక్ష తేదీ ఏప్రిల్ 30న నిర్ణయిస్తారన్నారు. గుంతకల్లులో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నెట్టికంటి సన్నిధిలో కర్నూలు జిల్లా న్యాయాధికారి



న్యాయాధికారికి తీర్థప్రసాదాలను అందజేస్తున్న ఆలయ అర్చకులు

గుంతకల్లుటౌన్, మార్చి27(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామిని గురువారం కర్నూలు జిల్లా న్యాయాధికారి జీ కబర్ది దర్శించుకున్నారు. న్యాయాధికారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేసి, ఆశీర్వాదం చేశారు. సబ్ న్యాయాధికారి శేషాద్రి, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

జెల్లిపల్లి పరిసరాల్లో చిరుత సంచారం

కంబదూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జెల్లిపల్లి పరిసరాల్లో ఇటీవలిగా చిరుత సంచారం ప్రజలు, రైతుల్లో భయాందోళనలు రేపుతోంది. గ్రామస్థుడు గొల్ల రాజప్పకు చెందిన పెంపుడు కుక్కను బుధవారం రాత్రి చిరుత చంపి, తినేసింది. గొర్రెల వద్ద కాపలాగా ఉన్న కుక్కను చిరుత అర కిలోమీటరు దూరం పట్టుకెళ్లి, చంపి తినేసింది. ఉదయాన్నే కుక్క మృతిచెందిన విషయం గుర్తించారు. అటవీ శాఖాధికారులు.. చిరుత నుంచి రక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సర్పంచు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

శెట్టూరు,మార్చి27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం సర్పంచు కుమార్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానిక మసీదు సమీపంలో ఏర్పాటు చేసిన విందులో పెద్దఎత్తున ముస్లింలు హాజరయ్యారు. వారికి సర్పంచ్ భోజనం వడ్డించారు.


వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి: టీడీపీ

బొమ్మనహాళ్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని స్టోర్ డీలర్ల సంఘం మండలఅధ్యక్షుడు పయ్యావుల మోహన్, టీడీపీ నాయకులు అప్పారావు, నవీన్, మల్లీడు శ్రీనివాసులు, సంగప్ప, దుర్గాప్రసాద్ సూచించారు. మండలకేంద్రంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉద్దేహాళ్ గ్రామంలో వైసీపీ నాయకుడు రాజ్‌కుమార్ చేసిన కబ్జాలు నీకు కనపడలేదా అని ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ప్రభుత్వంపైన, అధికారులపై ఆరోపించడం సబబుకాదని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో రాజ్‌కుమార్ ఆర్‌అండ్‌బీ స్థలాన్ని కబ్జా చేయడమే కాకుండా ఇళ్లకు వెళ్లే దారిని కూడా ఆక్రమించి భవనాన్ని కట్టాడని తెలిపారు. ఇవేవీ మీకు తెలియవా అని ప్రశ్నించారు. ఏమి జరుగుతుందో తెలుసుకుని మాట్లాడాలని, ఇష్టానుసారంగా మాట్లాడితే సహించమని తెలిపారు. సమావేశంలో నాయకులు హనుంతు, గవిసిద్ధ, హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెట్టు గోవిందరెడ్డిపై కేసు నమోదు

బొమ్మనహాళ్, మార్చి 27(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఉద్ధేహాళ్ గ్రామంలో అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించినందుకు రాయదుర్గం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, వైసీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, నాయకుడు రాజ్‌కుమార్ తోసహా 50 మందిపై కేసు నమోదైంది. ఉద్ధేహాళ్ గ్రామంలో అనుమతి లేకుండా అంతర్‌రాష్ట్ర రాహదారిపై ర్యాలీ నిర్వహించి దాదాపు గంటపాటు ప్రయాణికులుకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించారని, దీంతో 30యాక్టు ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయాల తనిఖీ



శెట్టూరు తహసీల్దార్‌తో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

శెట్టూరు/కుందుర్పి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శెట్టూరు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ రికార్డుల గదిని, కార్యాలయ భవనాలను పరిశీలించి వాటి స్థితి గతులను తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టిని అడిగి తెలుసుకున్నారు. భవనాల మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది వివరాలు, పరిపాలన అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వసంతబాబు, డిప్యూటీ తహసీల్దార్ అనిల్ కుమార్ రెడ్డి, ఆర్‌ఐ గోవిందరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు. అలాగే కుందుర్పి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని కూడా జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడి స్థితిగతుల గురించి తహసీల్దార్ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు తిప్పేస్వామి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో అమిలినేని మార్క్

- కళ్యాణదుర్గంలో వాల్మీకి, కనకదాస విగ్రహాల ఏర్పాటు
- సర్కిల్ అభివృద్ధికి చర్యలు ● రూ.60 లక్షల సొంత డబ్బు వెచ్చింపు



సుందరంగా రూపుదిద్దుకోనున్న వాల్మీకి సర్కిల్ ఇదే..



కనకదాస విగ్రహం ఏర్పాటుకు నిర్మించిన రాతి కట్టడం

కళ్యాణదుర్గం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సొంత నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రూ. 60 లక్షలు సొంత నిధులు ఖర్చు చేసి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడంతో ఆయా వర్గాలకు చెందిన ప్రజలు అభినందిస్తున్నారు. నియోజకవర్గంలో వాల్మీకులు, కురుబ సామాజిక వర్గాలకు చెందిన వారే అధికంగా ఉన్నారు. కళ్యాణదుర్గం పట్టణంలో వాల్మీకి సర్కిల్‌కు ఎంతో ప్రత్యేకత ఉంది. అక్కడ వాల్మీకి భారీ విగ్రహంతో పాటు, సర్కిల్ రూపురేఖలు మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. రూ. 50 లక్షలు సొంత డబ్బులతో వాల్మీకి సర్కిల్‌ను రూపుదిద్దేందుకు ఎమ్మెల్యే ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులో భాగంగా వాల్మీకులు కర్ణాటకకు వెళ్లి విగ్రహ పనులకు పూజలు చేసి వచ్చారు. విగ్రహం తయారీకే రూ. 10 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. మిగిలిన రూ. 40 లక్షలతో వాల్మీకి సర్కిల్‌ను అభివృద్ధి చేస్తున్నారు. కంబదూరుకు వెళ్లే రింగురోడ్డు మధ్యలో కురుబ సామాజిక వర్గానికి చెందిన భక్త కనకదాసు విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు సాగుతున్నాయి. రూ.10 లక్షలతో భక్త కనకదాసు కాంస్య విగ్రహం ఏర్పాటు చేయబోతున్నారు. ఈ విగ్రహం పనులన్నీ బెంగళూరులో చేయిస్తున్నారు. వైసీపీ హయాంలో కురుబ సామాజిక వర్గానికి చెందిన ఉషశ్రీచరణ్ మంత్రిగా పనిచేశారు. కనకదాసు విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి వదిలేశారని ఆ సామాజిక వర్గానికి చెందిన వారు విమర్శిస్తున్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తాం



కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏమిటో కళ్లకు కట్టినట్లు చూపిస్తాం. అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించడమే నా ప్రధాన లక్ష్యం. సొంత డబ్బు ఖర్చు చేసి అభివృద్ధికి ముందడుగు వేస్తున్నాం. ఇప్పటికే పట్టణ రూపు రేఖలు తీర్చిదిద్దేందుకు కోట్లాది రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు రహదారి విస్తరణ పనులు వేగవంతంగా చేస్తున్నాం. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని మార్చడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం.

\- అమిలినేని సురేంద్రబాబు, ఎమ్మెల్యే, కళ్యాణదుర్గం

నెరవేరుతున్న వాల్మీకుల కల



రూ.50లక్షలతో వాల్మీకి విగ్రహంతో పాటు, సర్కిల్‌ను అందంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సొంత డబ్బులు ఖర్చు చేసేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయం. వాల్మీకుల దశాబ్దాల కల నెరవేరుతోంది. వాల్మీకి సర్కిల్‌ను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కృషి మరవలేనిది. వాల్మీకులందరూ రుణపడి ఉంటాం. వాల్మీకుల అభివృద్ధి కోసం ఆయన చిత్తశుద్ధితో పనిచేస్తున్నారనడానికి అభివృద్ధి కార్యక్రమాలే నిదర్శనం.

\- వైపీ రమేష్, డైరెక్టర్, వాల్మీకి కార్పొరేషన్, కళ్యాణదుర్గం

సజావుగా కౌన్సిల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ జేసీపీఆర్, ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, మార్చి27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం సజావుగా సాగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి హాజరయ్యారు. ఇందులో 14అంశాలపై అధికారులు, సభ్యులు చర్చ జరిపి ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. ఇందులో ఫయాజ్‌బాషా ఇంటి వివాదంపై 9మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటుచేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. కక్షపూరితంగా వ్యవహరించలేదని, మున్సిపల్ యాక్ట్‌ప్రకారం అక్రమంగా నిర్మించిన వాటికి మాత్రమే నోటీసులు ఇచ్చామని, స్పందించకపోతే డెమోలిష్ చేయడానికి వెళ్లామే తప్ప వీటిలో ఎలాంటి కక్షపూరితం లేదని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలోనే వాటిని రిజెక్ట్ చేశారని చెప్పారు. ఆరుసెంట్ల పర్మిషన్ తీసుకొని 13సెంట్లలో ఇళ్లు నిర్మించడంతోనే ఈ సమస్య ఏర్పడిందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇల్లు కూడా మున్సిపాలిటీ స్థలాన్ని ఆక్రమించి కట్టారని, త్వరలోనే ఆయనకు కూడా నోటీసులు అందజేస్తామని అన్నారు. అన్నీ మున్సిపాలిటీ రూల్స్ ప్రకారమే జరుగుతాయని తెలిపారు. ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి మాట్లాడుతూ తాడిపత్రి మున్సిపాలిటీకి నెంబర్‌వన్ మున్సిపాలిటీగా పేరుందని నారా లోకేష్ ప్రశంసించడం ఎంతో సంతోషకరమన్నారు. ప్రజల సహాయ సహకారాలు అందించడం, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయడం వల్లే అభివృద్ధి జరిగిందని తెలిపారు. మున్సిపాలిటీ ఆదాయాన్ని ఇంకా పెంచేందుకు ప్రతి ఒక్కరూ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. వేసవిలో తాగు నీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

చెట్లను నరికితే జైలుకు పంపిస్తాం

చెట్లను నరికితే జైలుకు పంపిస్తామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జేసీ పార్కులో ఆయన మాట్లాడుతూ.. చెట్లను పెంచాలంటే ఎన్నో ఏళ్లు పడుతుందన్నారు. వాటిని సంరక్షించాల్సింది పోయి నరకడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చెట్లను నరికితే సహించే ప్రసక్తే లేదన్నారు. మీకు ఏదైనా సమస్య ఉన్నట్లయితే, చెట్ల వల్ల ఇబ్బంది పడుతున్నామని మా దృష్టికి తీసుకువస్తే మున్సిపల్ అధికారులు వచ్చి పరిష్కరిస్తారన్నారు. మాకు చెప్పకుండా చెట్ల జోలికి వెళితే జైలుకు పంపడం ఖాయమని హెచ్చరించారు.

మున్సిపల్ కార్యాలయం అవినీతిమయం

గుంతకల్లు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం అవినీతిమయంగా మారిందని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఎన్ భవాని అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్ కే. కృపాకర్ మాట్లాడుతూ.. పట్టణంలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని, నాలుగురోజులైనా శుభ్రపరచడం లేదని అన్నారు. పురపాలక సంఘ కార్యక్రమాలపై కౌన్సిలర్లకు సరైన సమాచారం ఇవ్వడంలేదని, కలెక్టరు వచ్చినా చెప్పడం లేదని వాపోయారు. కమిషనర్ సభ్యుల పట్ల అనుచితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వైస్ చైర్‌పర్సన్ నైరుతి మాట్లాడుతూ బర్త్, డెత్, సర్టిఫికెట్ల జారీ, టౌన్‌ప్లానింగ్ తదితర విభాగాల్లో అవినీతి పేరుకొని పోయిందని ఆరోపించారు. తర్వాత వైసీపీ కౌన్సిలర్లు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. కమిషనర్ నయీం అహ్మద్, టీడీపీ కౌన్సిలర్లు కేసీ అనూరాధ, అరుణ, విద్యారాణి, యూ ప్రభాకర్, వై సుధాకర్, వైసీపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



యల్లనూరులో డిక్లరేషన్ అందుకుంటున్న రమాదేవి



ఉరవకొండలో.. ఈడిగ ప్రసాద్



పెద్దపప్పూరులో.. నాగవేణి



రాయదుర్గంలో.. అరుణ్‌కుమార్

ఏకగ్రీవంగా వైస్ ఎంపీపీల ఎన్నిక

యల్లనూరు,మార్చి27(ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ ఉపాధ్యక్షురాలిగా తిమ్మంపల్లి ఎంపీటీసీ సభ్యురాలు పందిళ్లపల్లి రమాదేవి వైసీపీ తరపున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలకేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన ఉపాధ్యక్ష ఎన్నికల్లో రమాదేవి అభ్యర్థిత్వాన్ని యల్లనూరు ఎంపీటీసీ మెంబర్ తిమ్మతి ప్రతిపాదించారు. మిగిలిన సభ్యులందరూ ఆమోదించడంతో అధికారులు రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. గతంలో ఉపాధ్యక్షుడిగా ఉన్న రంగయ్య మృతి చెందడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. సమావేశానికి ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు, ఒక కో ఆప్షన్ మెంబరు హాజరయ్యారు. అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు పరిస్థితిని సమీక్షించారు. రూరల్ సీఐ సత్యయేసు బాబు, యల్లనూరు,పుట్లూరు ఎస్‌ఐలు స్పెషల్‌పార్టీ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఉరవకొండ వైస్‌ఎంపీపీగా ఈడిగ ప్రసాద్

ఉరవకొండ: ఉరవకొండ మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఎంపీటీసీ సభ్యుడు ఈడిగ ప్రసాద్ వైసీపీ తరపున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల ప్రత్యేక అధికారి కుష్బూ కొఠారి ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ జరిగింది. ఆయన అభ్యర్థిత్వాన్ని నింబగల్లు ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వర్ ప్రతిపాదించగా ఉరవకొండ ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి బలపరిచారు. మిగిలిన సభ్యులంతా ఆమోదం తెలపడంతో ఈడిగ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.

పెద్దపప్పూరు వైస్ ఎంపీపీగా నాగవేణి..

పెద్దపప్పూరు: మండలపరిషత్ ఉపాధ్యక్షురాలుగా వైసీపీకి చెందిన పసులూరు ఎంపీటీసీ సభ్యురాలు వరదమ్మగారి నాగవేణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఉపాధ్యక్ష ఎన్నికల్లో నాగవేణి అభ్యర్థితత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శకుంతల, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రాయదుర్గం వైస్ ఎంపీపీగా అరుణ్‌కుమార్

రాయదుర్గంరూరల్: రాయదుర్గం మండల వైస్ ఎంపీపీగా వైసీపీకి చెందిన అరుణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసయాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో జుంజురంపల్లి ఎంపీటీసీ సభ్యుడు సురేష్ అరుణ్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించగా, బీఎన్‌హళ్లి ఎంపీటీసీ సభ్యురాలు పాటిల్ లక్ష్మి బలపరిచారు. పది మంది ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తి ఎన్నుకున్నారు. దీంతో అతడి ఎన్నిక ఏకగ్రీవమైంది.

పంక్షన్ హాల్ సీజ్

గుత్తి,మార్చి27(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఆర్‌ఎస్ రోడ్డులో వక్ఫ్‌బోర్డు స్థలంలో ఉన్న వసుధ ఫంక్షన్ హాల్‌ను గురువారం సీజ్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా తెలిపారు. 2019నుంచి ఈ ఏడాది వరకు రూ.5.22లక్షలు పన్ను బకాయిపడ్డారన్నారు. బకాయి చెల్లించాలని నోటీసులు జారీ చేసినా పట్టించుకోలేదన్నారు. 50 శాతం వడ్డీ మాఫీ పథకం గురించి వివరించినప్పటికీ యాజమాన్యం పన్ను చెల్లించేందుకు నిరాకరించారన్నారు. దీంతో మున్సిపల్ చట్టం ప్రకారం ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. మున్సిపల్ మేనేజరు రాంబాబు, ఆర్వో కమలాకర్‌తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహానికి రీపోస్టుమార్టం

పుట్లూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మడ్డిపల్లిలో ఓ మహిళ మృతదేహానికి గురువారం రీ పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రమణారెడ్డి తెలంగాణ రాష్ట్రానికి చెందిన వినోదినిదేవిని 2007లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరు విజయవాడలోని తాడేపల్లిలో నివాసం ఉండేవారు. అయితే అక్కడ వినోదినిదేవి మృతి చెందడంతో మృతదేహాన్ని రమణారెడ్డి గతేడాది నవంబరు 19వ తేదీన మడ్డిపల్లికి తీసుకొచ్చి ఖననం చేశాడు. కాగా ఆమె మృతిపై అనుమానాలున్నాయని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మృతురాలి తమ్ముడు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు తహసీల్దార్ శేషారెడ్డి సమక్షంలో వైద్యులచేత రీపోస్టుమార్టం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి గాయాలు

డీ.హీరేహాళ్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో గల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని బళ్లారి జిల్లా హలకుంది గ్రామానికి చెందిన ఎర్రిస్వామి(36) స్నేహితుడు బసవతో కలిసి బైక్‌పై గురువారం బళ్లారి వైపు నుంచి రాంపురానికి బయలుదేరాడు. కాగా మార్గంమధ్యలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో ఉన్న జాతీయరహదారిపై ప్రమాదవశాత్తు మోరీ నుంచి బైక్‌తోపాటు కింద పడిపోయారు. ప్రమాదంలో ఎర్రిస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. బసవకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో అక్కడి వచ్చిన బంధువులు బసవను వెంటనే బళ్లారి ఆసుపత్రికి తరలించారు. ఎర్రిస్వామి మృతదేహాన్ని కూడా బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిరువురు గొర్రెల వ్యాపారం చేస్తుండేవారని వారి కుటుంబసభ్యులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



రోడ్డుపై ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

రాయదుర్గంరూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ పట్టణంలోని మారెమ్మగుడి ఏరియా కాలనీ మహిళలు గురువారం స్థానిక మొలకాల్మూరు రోడ్డు ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. పలువురు మాట్లాడుతూ.. తమ కాలనీలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. కనీసం మూడు రోజులకొకసారి కూడా తాగునీరు అందడం లేదన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. సమస్యను పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

తూకాల్లో బియ్యం తక్కువగా వస్తున్నాయి..

- ఇలా అయితే లబ్ధిదారులకు పంపిణీ చేయలేం
- తహసీల్దార్ వద్ద రేషన్ డీలర్ల ఆవేదన

విడపనకల్లు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రేషన్‌దుకాణాలకు బియ్యం తక్కువ తూకాల్లో వస్తున్నాయంటూ మండలంలోని వివిధ గ్రామాల స్టోర్ డీలర్లు ఆవేదన చెందుతూ గురువారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ తహసీల్దార్‌ను, ఇతర అధికారులను కలిసి తమ బాధను చెప్పుకున్నారు. పలువురు మాట్లాడుతూ.. రేషన్‌షాపులకు తక్కువ బియ్యం ఇస్తున్నారని, ఈ విధంగా ఇస్తే లబ్ధిదారులకు తాము బియ్యం వేయలేమంటూ వాపోయారు. మాళాపురం షాపులో 45 క్వింటాళ్ల బియ్యం రావాల్సి ఉండగా కేవలం 30 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయన్నారు. వాటిని ఎవరికి పంపిణీ చేయాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వీ కొత్తకోట ఎస్సీ కాలనీలో ఉన్న స్టోర్‌కు 50 క్వింటాళ్లు బియ్యం రావాల్సి ఉండగా.. 33 క్వింటాళ్లు వచ్చాయన్నారు. ఈ విధంగా మండలంలోని 42 దుకాణాలకు గాను దాదాపు 20 దుకాణాలకు బియ్యం తక్కువగా వచ్చాయన్నారు. స్టాక్ పాయింట్ నుంచి బియ్యం దుకాణానికి వచ్చే సరికి ఒక్కొక్క బస్తాలో దాదాపుగా 3 నుంచి 4 కేజీల బియ్యం తక్కువగా ఉన్నాయన్నారు. 50 కేజీల బస్తాకు 4 కేజీలు తక్కువ ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ఖచ్చితమైన తూకాలతో బియ్యం ఇస్తేనే లబ్ధిదారులకు సరఫరా చేస్తామన్నారు. గత మూడు నెలలుగా ఇదే తంతు జరుగుతోందన్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకు సివిల్ సప్లయ్ ఈటీ రాము మట్లాడుతూ.. ఎటువంటి కారణాలు లేకుండా బియ్యం తగ్గించి ఇవ్వరన్నారు. స్టాక్ పాయింట్ వద్ద బియ్యం తక్కువ వస్తున్నాయి అంటే.. డీలర్లు నేరుగా అక్కడికే వెళ్లి వేలి ముద్రలు వేసి దగ్గర ఉండి తూకాలు వేయించుకుని బియ్యం తెచ్చుకోవాలని సూచించారు. స్టాక్ పాయింట్ వద్ద తూకం తక్కువ ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. విచారించి స్టాక్ పాయింట్ అధికారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉపాధి పనుల్లో రూ.4.50లక్షల అవినీతి

పుట్లూరు, మార్చి27(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో రూ.4.50లక్షల మేర అవినీతి జరిగిందని సామాజిక తనిఖీ అధికారులు వెల్లడించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం నిర్వహించారు. మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024మార్చి 31వరకు జరిగిన 575పనులకు రూ.11.30కోట్లు ఖర్చుచేశారు. వీటిపై ఆడిట్ చేయగా రూ.4,44,878 సొమ్ము అవినీతి జరిగినట్లు గుర్తించి రికవరీకి అధికారులకు ఆదేశించారు. పనుల్లో నాణ్యత లేదంటూ, మరికొన్ని గ్రామాల్లో మస్టర్లలో సంతకాలు ఒకరే పెట్టినట్లు తేటతెల్లమైందన్నారు. కొన్నిగ్రామాల్లో జాబ్‌కార్డుదారులను విచారించేందుకు వెళ్లగా వారు అందుబాటులో లేకపోవడం గుర్తించారు. అనంతరం డ్వామా పీడీ సలీంబాషా పలు పంచాయతీల్లో రికవరీకి ఆదేశించారు. పుట్లూరులో రూ.49,438, కొండాపురంలో రూ.5321, మడ్డిపల్లిలో రూ.12,727 చాలవేములలో రూ.13,013, గాండ్లపాడులో రూ.1217, మడుగుపల్లిలో రూ.5161, కోమటికుంట్లలో రూ.16263, చింతలపల్లిలో రూ.3577, తక్కళ్లపల్లిలో రూ.244 , కందికాపులలో రూ.1672, చెర్లోపల్లిలో రూ.79140, దోసలేడులో రూ.1364, సూరేపల్లిలో రూ.23843, బాలాపురంలో రూ.2,18,011, కడవకల్లులో రూ.14487 రికవరీకి ఆదేశించారు.

ఎస్సీ వర్గీకరణ ఘనత చంద్రబాబుదే

ఉరవకొండ, మార్చి27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేపట్టిన ఘనత సీఎం చంద్రబాబుదేనని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కౌకుంట్ల రవి పేర్కొన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు వరప్రసాద్, రామాంజినేయులు, రవి, చంద్ర, సురేష్, శంకరయ్య, మధు, రమేష్, పాల్గొన్నారు.

అనంతపురం మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, మార్చి27(ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని సంత్రగాచి-యశ్వంతపూర్-సంత్రగాచి మధ్య (వయా అనంతపురం) ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. సంత్రగాచి-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (నం.02863) ఏప్రిల్ 3, 10, 17, 24 తేదీల్లో (గురువారాల్లో) నడపనున్నట్లు తెలియజేశారు. ఈ రైలు సంత్రగాచిలో పేర్కొన్న తేదీల్లో గురువారం మధ్యాహ్నం 12.50 గంటలకు బయలుదేరి శనివారం తెల్లవారుజామున 12.55 గంటలకు యశ్వంతపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు ఏప్రిల్ 5, 12, 19, 26 తేదీల్లో (శనివారాల్లో) తెల్లవారుజామున 4.30 గంటలకు యశ్వంతపూర్‌లో బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 1.25 గంటలకు సంత్రగాచికి చేరుకుంటుందన్నారు.

రసవత్తరంగా బార్ అసోసియేషన్ ఎన్నిక

కళ్యాణదుర్గం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం రసవత్తరంగా సాగాయి. అధ్యక్ష స్థానానికి పార్థసారథి చౌదరి, హరి చక్రవర్తి పోటీ పడ్డారు. బార్ అసోసియేషన్‌లో 46 మంది న్యాయవాదులు ఉన్నారు. ఇందులో 37 మంది పోలీంగులో పాల్గొని ఓటు వేశారు. పార్థసారథి చౌదరికి 23 ఓట్లు, హరి చక్రవర్తికి 14 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారులు ఎర్రిస్వామి, సంపత్ కుమార్ తెలిపారు. 9 ఓట్ల ఆధిక్యంతో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పార్థసారథి చౌదరి విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా రామాంజనేయులు, కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా తిప్పేస్వామి, సహాయ కార్యదర్శిగా హనుమంతరాయుడు, మహిళాప్రతినిధిగా శ్రీలతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కూడేరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గురువారం ఉదయం రోడ్డు పక్కన ఆ వ్యక్తి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు . గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతడిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రక్తపు వాంతులు అవడం వల్లే మృతి చెంది ఉండవచ్చునని చెప్పారు. అతడివద్ద ఎలాంటి ఆధారాలు లేవని పోలీసులు తెలిపారు.

గడ్డివామి దగ్ధం

కంబదూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కదిరిదేవరపల్లిలో రైతు నరసింహులుకు చెందిన గడ్డివామి గురువారం దగ్ధమైంది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతోనే ఇలా జరిగిందని బాధితరైతు వాపోయారు. రూ. 2 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

గుంతకల్లుటౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైనాపురం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి డీ.చెన్నకేశవులు(23) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కసాపురం పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. చెన్నకేశవులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా వర్క్‌ఫ్రం హోమ్ చేస్తున్నాడు. అయితే గత కొద్ది రోజులుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు చోట్ల చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో మనస్థాపానికి గురై బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత అనంతపురానికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.